


ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్‌లోని** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా.. నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖలవారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికను వారు వివరించారు. *- నిర్మల్ టౌన్/ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 24*

## 'స్వేద పత్రం' అభివృద్ధిని కండ్లకు కట్టింది..



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'స్వేద పత్రం'లో తొమ్మిదిన్నరేండ్లలో కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కండ్లకు కట్టినట్లు వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తించి వాస్తవాలు మాట్లాడాలి. ప్రభుత్వ పెద్దలు ఎన్నికల హామీలను అమలు చేయకుండా.. ప్రజలను పక్కదారి పట్టించడానికి శ్వేత పత్రం పేరిట అబద్ధాలు మాట్లాడుతున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగింది. సంక్షేమ పథకాలు అమలయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో 40 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న పెన్‌గంగపై చనాక-కొరాట ప్రాజెక్టును నిర్మించింది. పట్టణాలకు పరిమితమైన ఐటీ రంగం ఆదిలాబాద్‌కు విస్తరించిందంటే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల కృషే కారణం.

*- జోగు రామన్న, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్.*

## కాంగ్రెస్ శ్వేతపత్రం తప్పుల తడక



ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను పక్కదారి పట్టించేందుకు శ్వేతపత్రం పేరిట నాటకాలు ఆడుతున్నది. ప్రభుత్వ పెద్దలు విడుదల చేసిన పత్రం తప్పుల తడకగా ఉంది. తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోయింది. దేశం మెచ్చే విధంగా అభివృద్ధి జరుగగా.. సంక్షేమ పథకాలు అమలయ్యాయి. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ స్వేదపత్రంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రగతి, సంక్షేమ పథకాల లెక్కలను చక్కగా వివరించారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి. పెన్‌గంగపై నిర్మించిన చనాక- కొరాట ప్రాజెక్టుతో బోథ్ నియోజకవర్గంలో చేలకు సాగునీరు అందుతున్నది. మిషన్ భగరథ పథకంతో ఇంటింటికీ శుద్ధజలం వస్తున్నది. స్వచ్ఛమైన నీటి వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని తండాలు, గూడేల్లో వ్యాధులకు చెక్ పడింది.

*- జాదవ్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే, బోథ్.*



ఆదిలాబాద్‌లోని తన నివాసంలో స్వేదపత్రంపై టీవీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూస్తున్న రామన్న




# స్వేద పత్రంలో మన జిల్లా..

**చనాక-కొరాట బరాజ్ నిర్మాణాన్ని పూర్తి చేసి ట్రయల్ రన్ చేశాం..**

- రూ.25 కోట్లతో కుమ్రం భీం స్మారక చిహ్నం, మ్యూజియం ఏర్పాటు చేశాం..
- ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరు చేశాం..
- ఆదివాసుల సంక్షేమానికి పాటుపడ్డాం.. పోడు పట్టాలు అందించాం..
- కొత్త పంచాయతీలు ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మార్చినం..
- 'శ్వేత పత్రం'లోని డొల్లతనం ఎత్తిచూపిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

*తెలంగాణ రాష్ట్రాన్ని విఫల రాష్ట్రంగా చూపెట్టి, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బ తీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'శ్వేత పత్రం'లోని డొల్లతనాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) ఎత్తిచూపారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో చమటోడ్చి, రక్తాన్ని చిందించి.. అధికారులు, నాయకులు కష్టపడి చేసిన అభివృద్ధిని కండ్లకు కడుతూనే.. చేసిన ఖర్చు తద్వారా పెరిగిన సంపద సృష్టిపై 'స్వేద పత్రం' విడుదల చేశారు. చేసిన అప్పు ఎంత.. పెట్టిన పెట్టుబడి ఎంత.. అనే లెక్కలను సమగ్రంగా వివరిస్తూ తెలంగాణను ఒక విఫల రాష్ట్రంగా చూపించాలని కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను తేటతెల్లం చేశారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో రూ.50 లక్షల కోట్లపైనే సంపద సృష్టించిన తీరు తెన్నులను తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కండ్లకు కట్టినట్టు చూపించారు.*

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గురించి 'స్వేద పత్రం'లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విపులంగా వివరించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసిందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో చనాక- కొరాట బరాజ్ నిర్మాణాన్ని పూర్తి చేసి ట్రయల్ రన్ చేశామన్నారు. కావాలంటే కొబ్బరికాయ కొట్టి మీరే చేసినట్లు చెప్పుకున్నా తమకు అభ్యంతరం లేదంటూ కాంగ్రెస్ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు పడిన ఇబ్బందులు, నాలుగు జిల్లాలుగా ఏర్పడ్డాక మెడికల్ కాలేజీలు, చేరువైన పాలన గురించి ప్రస్తావించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రూ.25 కోట్లతో కుమ్రం భీం స్మారక చిహ్నం, మ్యూజియం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ద్వితీయ నగరాలకు ఐటీ విస్తరించామని చెప్తూ ఆదిలాబాద్‌లోని ఐటీ హబ్ ఏర్పాటు చేసిన అంశాన్ని ప్రస్తావించారు. ఆదివాసీ, గిరిజన సంక్షేమం, పోడు పట్టాల పంపిణీ, కొత్త పంచాయతీల ఏర్పాటు ఇలా అన్ని జిల్లాల్లో చేసిన అభివృద్ధికి 'స్వేద పత్రం'లో అద్దం పట్టారు.

### 40 ఏండ్ల కలను సాకారం చేసిన కేసీఆర్ ప్రభుత్వం

పెన్‌గంగ నదిపై నాలుగేండ్లుగా పెండింగ్‌లో ఉన్న చనాక-కొరాట బరాజ్ నిర్మాణాన్ని కేసీఆర్ సర్కారు పూర్తి చేసి, ఇటీవలే ట్రయన్ రన్ కూడా విజయవంతం చేసిందన్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో గల 89 గ్రామాల పరిధిలోని 52 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పూర్తయిందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ దళపతి కేసీఆర్, అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు మహారాష్ట్ర సీఎం, మంత్రులు, అధికారులతో చర్చలు జరిపారన్నారు. ఫలితంగా ప్రాజెక్టు నిర్మాణానికి రెండు రాష్ట్రాలు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో గల జైనథ్ మండలం కొరాట వద్ద నిర్మించే బరాజ్, ప్రధాన కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.451.46 కోట్లు మంజూరు చేసిందన్నారు. పంప్‌హౌస్ నిర్మాణ పనులకు రూ.118.92 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు.

### రూ.40 కోట్లతో ఐటీ టవర్ నిర్మాణం

ఆదిలాబాద్ జిల్లాలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) రంగం విస్తృత పర్చడానికి కేసీఆర్ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మావల మండలంలోని బట్టిసవర్‌గాంలో గల సర్వే నంబరు 72లో మూడెకరాల స్థలంలో రూ.40 కోట్లతో టవర్ నిర్మాణాన్ని చేపట్టిందని గుర్తు చేశారు. పనులు కూడా కొనసాగుతున్నాయని, టీఎస్‌ఐఐసీ అధికారులు పర్యవేక్షించారని చెప్పారు. 50 వేల చదరపు అడుగుల వైశాల్యంలో నిర్మాణమవుతుండగా.. 1000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని స్పష్టం చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-AII

LOSS OF PASSPORT
I, THATIPAMULA RAJKUMAR S/o THATIPAMULA RAMESH, Aged: 29Yrs Occ:Doctor, R/o.H.No. 4-1/15, Krishna Colony, Srirampur Mondal Naspur, Dist:Mancherial, have lost my original pass port No. L4090177, while going in bus from Hyderabad to Mancherial. if any one found pls inform my mobile: 9393343061

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677



నిర్మల్ పట్టణంలో వాహనదారుడికి జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

# మళ్లీ చాన్స్

**కేసీఆర్ సర్కారు తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం డిస్కౌంట్**

- వాహనదారులకు పెండింగ్ చలాన్లపై భారీ రాయితీ
- రేపటి నుంచి జనవరి 10వ తేదీ వరకు అవకాశం
- ఆన్‌లైన్ ద్వారా మీ సేవా కేంద్రాల్లో చెల్లింపునకు పోలీస్ శాఖ ఆఫర్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 24 : కేసీఆర్ సర్కారు తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వాహనదారులకు మరో అవకాశం కల్పించింది. సర్కారు ఆదేశాల మేరకు పోలీస్ శాఖ పెండింగ్ చలాన్లకు క్లియరెన్స్ కోసం బంపర్ ఆఫర్ ప్రకటించింది. టూ, త్రీ, ఫోర్ వీలర్, తోపుడు బండ్లు, భారీ వాహనాలకు రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నెల 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు డిస్కౌంట్ వర్తించనుంది. ద్విచక్ర వాహనాలకు 80 శాతం(అంటే ఒక్క వాహనంపై రూ.100 ఫైన్ ఉంటే రూ.20లు చెల్లించాలి).. ఆటోలు, ఫోర్ వీలర్లకు 60 శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లకు 90 శాతం.. భారీ వాహనాలకు 50 శాతం రాయితీ ప్రకటించింది. రాయితీ ఎప్పటి వరకు వర్తించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా.. నిర్లక్ష్యంగా వాహనాలు నడుపడం, రాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వెళ్లడం, సీటు బెల్టు ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడుపడంతో ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. ఈ జరిమానా డబ్బులను ఆన్‌లైన్ ద్వారా మీ సేవా, ఈ సేవా కేంద్రాల్లో చెల్లించాలని పేర్కొన్నారు.

**2018-2023 సంవత్సరం వరకు..**

| సంవత్సరం | చలాన్ల సంఖ్య | నగదు(రూ.) |
|---|---|---|
| 2018 | 138 | 71,300 |
| 2019 | 18,378 | 99,36,190 |
| 2020 | 35,270 | 1,64,03,760 |
| 2021 | 75,667 | 3,64,88,080 |
| 2022 | 1,42,668 | 7,93,03,465 |
| 2023 | 1,61,838 | 6,40,18,175 |
| మొత్తం | 4,33,959 | 20,62,20,970 |



# మెర్రీ క్రిస్మస్

ఆదిలాబాద్‌లో ప్రార్థనలకు ముస్తాబైన చర్చి

- నేడు ఏసు పుట్టిన రోజు
- ప్రార్థనలకు సిద్ధమైన క్రైస్తవులు

**ఏసుక్రీస్తు జన్మదినాన్ని** పురస్కరించుకొని నేడు(సోమవారం) క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు జరుపుకోనున్నారు. ఈ మేరకు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని చర్చిలను ముస్తాబు చేశారు. రంగులు వేసి.. విద్యుద్దీపాలను అమర్చి శోభాయమానంగా ముస్తాబు చేశారు. బాల యేసు, మేరి మాత, క్రిస్మస్ ట్రీలు, పశువుల పాకలు, నక్షత్రాలు ఏర్పాటు చేశారు. *- ఆదిలాబాద్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ)*



పతకాలు చూపిస్తున్న గురుకుల విద్యార్థులు

## గురుకుల విద్యార్థులకు గోల్డ్ మెడల్

ఇచ్చోడ, డిసెంబర్ 24 : 67వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిర్మల్ జిల్లా ఇచ్చోడ గిరిజన గురుకుల విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. గంగాప్రసాద్(ఐఎంపీసీ), ఎ.సతీష్ (9వ తరగతి), ఎల్.సచిన్ (9వ తరగతి)లు గోల్డ్ మెడల్ సాధించి ఆదిలాబాద్ జిల్లాకే వన్నె తెచ్చారు. ఎంపికైన విద్యార్థులు జనవరి 13వ తేదీన రాజస్థాన్‌లోని బికినేర్ జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ హరిరాం, పీడీ దిలీప్ అభినందించారు. కోచ్‌గా వ్యవహరించిన గౌతమ్‌ను పలువురు సన్మానించారు.

## డయాలసిస్ కేంద్రం ప్రారంభం

భైంసా, డిసెంబర్ 24 : నిర్మల్ జిల్లాలోని భైంసా పట్టణంలో గల ప్రభుత్వ ఏరియా దవాఖానలో ఏర్పాటు చేసిన ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని ఆదివారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డయాలసిస్ వ్యాధిగ్రస్తులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముథోల్ నియోజకవర్గంలోని రోగులు నిజామాబాద్, హైదరాబాద్ పట్టణాలకు చికిత్స కోసం వెళ్తున్నారని, వారిని దృష్టిలో పెట్టుకొని సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, సురేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

# గూడెం ఎత్తిపోతలపైనే ఆశలు

**కేసీఆర్ సర్కారులో మైల్డ్ స్టీలు పైపులైన్ ఏర్పాటు**

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు చొరవతో సమస్యకు పరిష్కారం
- మూడు మండలాల్లోని 30 వేల ఎకరాలకు సాగు నీరు

*గతేడాది వరద తాకిడికి కడెం జలాశయం గేట్లు దెబ్బతినగా, యాసంగికి సిద్ధమవుతున్న రైతాంగం గూడెం ఎత్తిపోతలపైనే ఆశలు పెట్టుకున్నది. ఎల్లంపెల్లి బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోతల పథకం ద్వారా కడెం ప్రాజెక్టు 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ వద్ద ఎత్తిపోయనుండగా, అక్కడి నుంచి దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలోని 30 వేల ఎకరాలకు సాగు నీరు అందనున్నది.*



గూడెం ఎత్తిపోతల పథకం

దండేపల్లి, డిసెంబర్24 : రైతన్నలు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే వాగులు, చెరువులు, వ్యవసాయ బావులపై ఆధారపడిన రైతులు నార్లు పోసుకున్నారు. కడెం, గూడెం ఎత్తిపోతల ఆయకట్టు రైతులు సైతం నార్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కడెం పూర్తి సామర్థ్యం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 683 అడుగుల నీరే ఉంది. దీనికి తోడు గత వానకాలంలో వరద తాకిడికి గేట్లు దెబ్బతినగా, ఈసారి కూడా నీళ్లు అందే అవకాశాలు లేవు. గత యాసంగిలో 28వ డిస్ట్రిబ్యూటరీ వరకు నీరందించడంతో బావులు, కుంటలు, చెరువుల్లో నీరుండి రైతులకు ఢోకా లేకుంటైంది. ఈ యాసంగికి కడెం నుంచి నీరందే అవకాశాలు లేకపోవడంతో రైతులంతా గూడెం ఎత్తిపోతలపైనే ఆశలు పెట్టుకున్నారు.

### 'ఎత్తిపోతల' మరమ్మతులు పూర్తి

దండేపల్లి మండలం గూడెం గోదావరి నది ఒడ్డున నిర్మించిన శ్రీ సత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకంలో తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించేందుకు అప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. కేసీఆర్ సర్కారులో జీఆర్(గ్లాస్ రీఎన్‌ఫోర్స్‌డ్) పైపులను తొలగించి.. మైల్డ్ స్టీలు(ఎంఎస్) పైపులను వేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న రాజీవ్‌సాగర్ నిర్మాణంలో వినియోగించిన ఎంఎస్ పైపులను గూడెం ఎత్తిపోతలకు ఏర్పాటు చేయడం వల్ల సమస్యకు పరిష్కారం లభించింది. రైతులకు సాగు నీరు అందించేందుకు ఇబ్బంది కాకుండా వేసవిలో 2 కిలో మీటర్ల మేర పైపులైన్‌లు వేశారు. ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు.ఎల్లంపెల్లి జలాశయ బ్యాక్‌వాటర్‌ను గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా తానిమడుగు సమీపంలోని కడెం ప్రాజెక్టు 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ వద్ద ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి దిగువన ఉన్న 42 కాలువ వరకు దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలోని 30 వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది.